ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
బుధవారం | జూన్ 24, 2026 | సంపుటి : 7 | సంచిక : 23 | పేజీలు : 2


గోపాలపూర్ ఊరచెరువు పనులు
## త్వరగా పూర్తి చేయాలి



- కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి

2 లో

# మమ్ముట్టికి పద్మభూషణ్..







### మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌కు పద్మశ్రీ ప్రదానం

### రెండో విడత పద్మ అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

**ఢిల్లీ, ఆయుధం:**

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 'పద్మ' అవార్డుల రెండో విడత ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం సాయంత్రం ఈ అవార్డులను ప్రదానం చేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు.

తెలుగు రాష్ట్రాల నుంచి పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీ నటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు.

దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి నేడు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని



నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.



## ఆదాయానికి మించి ఆస్తులు

### ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డిపై ఏసీబీ కేసు

- ఆయన నివాసాల్లో సోదాలు..
- 8 ప్లాట్లు, 10 ఎకరాల భూమి గుర్తింపు

**హైదరాబాద్, ఆయుధం:** నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ఏసీబీ నమోదు చేసింది. అనంతరం ఆయన్ను అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరిచింది. అక్రమాలకు పాల్పడి ఆస్తులు సంపాదించినట్లు మల్లారెడ్డి ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని మచ్చబొల్లారం, నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లోని మల్లారెడ్డి నివాసాలతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

ఏసీబీ తనిఖీల్లో మల్లారెడ్డికి చెందిన పలు ఆస్తులను గుర్తించారు. 4 ఇళ్లు, ఒక వాణిజ్య భవనం, 8 ఖాళీ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. ఆయన వద్ద సుమారు రూ.3.31లక్షల నగదు, రూ.50లక్షల బ్యాంకు నిల్వలు, మల్లారెడ్డి భార్య, కుటుంబసభ్యుల పేర్లపై 3 బ్యాంకు లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. విచారణలో భాగంగా వీటిని త్వరలో తెరవనున్నారు. సోదాల్లో గుర్తించిన మొత్తం ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ.3కోట్లుగా అంచనా వేశారు. మార్కెట్ విలువ ప్రకారం అనేక రెట్లు అధికంగా ఉండే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. మల్లారెడ్డిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరిచిన అనంతరం రిమాండ్‌కు పంపారు.



2 లో

## బలిదాన్ దివస్

- వరంగల్ జిల్లా బీజేపీ కార్యాలయంలో డా.శ్యామప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు
- పాల్గొన్న జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



## నగర పార్కుల అభివృద్ధికి ఆధునిక నమూనాలు

- కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి
- డబ్ల్యూఆర్ఐ ప్రతినిధులతో నగర పార్కుల అభివృద్ధిపై సమీక్ష సమావేశం

**హనుమకొండ, ఆయుధం:** నగరంలోని పార్కులను ప్రజలకు మరింత ఆకర్షణీయంగా, ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక నమూనాలు (డిజైన్లు) రూపొందించి అభివృద్ధి పనులను చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి సూచించారు. మంగళవారం హన్మకొండ కలెక్టరేట్ లో వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (డబ్ల్యూఆర్ఐ) ప్రతినిధులు, బల్దియా అధికారులతో నగర పార్కుల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్కుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వినోద, విశ్రాంతి సౌకర్యాల కల్పనకు సంబంధించి పలు సూచనలు చేశారు. బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధికి డబ్ల్యూఆర్ఐ అందించిన ఆధునిక డిజైన్లను అనుసరించి పార్కును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అదే తరహాలో నగరంలోని ఇతర పార్కుల అభివృద్ధికి కూడా డబ్ల్యూఆర్ఐ సాంకేతిక సహకారం అందించాలని కోరారు. వరంగల్ పరిధిలోని కీర్తినగర్ పార్కుతో పాటు నగరంలోని మరికొన్ని పార్కులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రజల అవసరాలు, పిల్లల వినోదం, పర్యావరణ పరిరక్షణ అంశాలను దృష్టిలో ఉంచుకొని పార్కులను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. నగరంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించే దిశగా పార్కుల అభివృద్ధి కీలకమని, ఈ కార్యక్రమంలో డబ్ల్యూఆర్ఐ పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డబ్ల్యూఆర్ఐ కన్సల్టెంట్ ప్రతినిధి ఎలైన్ అగీత్, జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్‌బాబు, డిప్యూటీ ఇంజనీర్ రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

### మైనర్లకు వాహనం ఇచ్చి
## చిక్కుల్లో పడొద్దు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**హనుమకొండ, ఆయుధం:** వాహనదారులు మైనర్లకు వాహనం అందజేసి వారి కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహన యజమాని చట్టపరమైన చిక్కుల్లో పడొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రతి పోలీసు అధికారి నిరంతరం కృషి చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం, కార్యక్రమాలను నిర్వహిస్తున్న కొంత మంది వాహనదారుల బాధ్యత రాహిత్య కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతునే వున్నాయి. ప్రధానం ఈ రోడ్డు ప్రమాదాలు అధికంగా మైనర్ వాహనదారుల కారణంగా అధికంగా జరుగుతున్నాయి. గత రెండు రోజుల క్రితం పర్వతగిరి పోలీస్ స్టేషన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వృద్దులతో పాటు, ఒక మైనర్ బాలుడు మరణించగా, మరో మైనర్ బాలుడు తీవ్ర గాయలతో ప్రస్తుతం చికిత్స పోందుతున్నాడు. ఈ రోడ్డు ప్రమాదానికి ప్రధాన కారణంగా మైనర్ బాలుడు అతి వేగంగా వాహనం నడుపుతూ ఇద్దరు వృద్దులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా ఢీ కొట్టడం కారణంగానే సంఘటన స్థలంలోనే మైనర్ బాలుడితో పాటు ఏ పాపం ఎరుగని ఇద్దరు వృద్దులు మరణించారు. ఈ సంఘటన చాలా బాధకరమైన విషయం. ఈ సంఘటనపై ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన విషయమని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఇలాంటి రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలకు కట్టుబడి వుండాలని, ముఖ్యంగా మైనర్లకు వాహనం అందజేయడం చట్టరీత్యా నేరమని, ఇలా మైనర్లకు వాహనం అందజేయడం ద్వారా మైనర్ల డ్రైవింగ్ కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహన యజమాని లేదా మైనర్ తల్లిదండ్రులు బాధ్యులుగా చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో వారిని జైలులు తరలించడం కూడా జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ వాహనదారులను హెచ్చరించారు. ఇకనైన వాహనదారులు తమ వాహనదారులు మైనర్ డ్రైవర్లకు వాహనాలు అందజేయడం లేదా వారిని ప్రోత్సహించవద్దని వాహనదారులకు సూచించారు.



2 లో

## హైదరాబాద్‌లో రోడ్డుకు ట్రంపు పేరు సిగ్గుచేటు

- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్
- వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద నిరసన







## ఐఎండీ చల్లని కబురు

తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు విస్తరించిన నైరుతి రుతుపవనాలు భారత వాతావరణ శాఖ వెల్లడి

**ఢిల్లీ, ఆయుధం:** గత కొన్నిరోజులుగా ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని వార్త చెప్పింది. దేశంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నట్లు పేర్కొంది. తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బిహార్‌లోకి ప్రవేశించాయని, వేగంగా విస్తరిస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆయా రాష్ట్రాల్లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

మధ్య అరేబియా సముద్రంలో ఏర్పడిన అనుకూల వాతావరణ పరిస్థితుల వల్ల రుతుపవనాలు చురుగ్గా ముందుకు సాగుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రోజుల్లో గుజరాత్, మధ్యప్రదేశ్‌తో పాటు మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, రుతుపవనాల కదలికతో ముంబయి, రాయ్‌గడ్ ప్రాంతాలను వాతావరణ శాఖ అప్రమత్తం చేసింది. నగరంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. అలాగే, కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, దక్షిణ మహారాష్ట్రగోవా తీర ప్రాంత ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదని పేర్కొంది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అలాగే, ఆకస్మిక వరదల వల్ల రోడ్డు, రైలు, విమాన సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని తెలిపింది.



2 లో

## వీబీజీ.రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి

- ఎంజి నరేగాను పునరుద్ధరించాలి
- ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తాం
- కలెక్టరేట్ వద్ద ధర్నాలో బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

## ప్రభుత్వం పేదల ఇండ్ల కూల్చివేతను ఆపండి

- పేదల గుడిసెలకు పట్టాలు ఇప్పించండి
- ఎమ్మెల్యేలకు వినతి పత్రం అందించిన వామపక్ష పార్టీలు

**హనుమకొండ, ఆయుధం:** పది రోజులుగా మహానగరంలో పేదలు వేసుకున్న గుడిసెలను గోపాలపురం చెరువు, గుండ్ల సింగారంలో కూల్చివేశారు. మరికొన్ని పేదల గుడిసెలను కూల్చాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. తక్షణమే మీరు జోక్యం చేసుకొని వెంటనే గుడిసెల కూల్చివేతను ఆపాలని, పేద ఇండ్లకు పట్టాలు ఇవ్వాలని హనుమకొండ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, ఎంసిపిఐ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కెఆర్.నాగరాజును కలిసి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మహానగరంలో అనేకమంది భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని వ్యాపారం చేస్తూ చలామనవుతున్న వారిపైన ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిలువ నీడలేని నిరుపేదలు కిరాయి కట్టలేక ప్రభుత్వ భూములు చెరువులలో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తుంటే పేదల ఇండ్లను ఎలాంటి హెచ్చరిక లేకుండా కూల్చివేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని వారన్నారు. ఈ మధ్యకాలంలో గోపాలపురం చెరువు, గుండ్ల సింగారంలో పేదల ఇండ్లను కూల్చారు. అదే సర్వే నంబర్లలో అనేకమంది బిల్డింగ్ కట్టుకొని నివాసం ఉంటుంటే వారి జోలికి పోకుండా పేదల ఇండ్లనే కూల్చడం వల్ల పేదలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా వారి కుటుంబాలను రోడ్నపడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు ఇస్తామని చెప్తున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పేదల ఇండ్లను కూల్చడం అనేది అత్యంత హేయమైన చర్య అని వారన్నారు. తక్షణమే మీరు జోక్యం చేసుకొని పేదల ఇండ్ల కూల్చివేతను ఆపాలని పేదలు వేసుకున్న ఇళ్లకు ఇంటి పట్టాలి ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి రేవూరి, ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు సానుకూలంగా స్పందించారు. పేదల ఇండ్లకు కూల్చివేతను ఆపడం కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ, వరంగల్ జిల్లా నాయకులు తోట బిక్షపతి, మేకల రవి, దండు లక్ష్మణ్, సిపిఎం జిల్లా నాయకులు ఎం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, సింగారపు బాబు, ఆరూరి కుమార్, ఎంసిపిఐ(యు) జిల్లా నేతలు గడ్డం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

- విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

**ములుగు, ఆయుధం:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం వెంకటాపురం మండలంలోని జవహర్‌నగర్ మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యా బోధన విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పాఠశాలలోని కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ల్యాబ్‌లను పరిశీలించిన విద్యార్థులు ప్రయోగాత్మక విద్యపై అవగాహన పెంపొందించుకునేలా ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. లైబ్రరీని సందర్శించి, విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇంచార్జ్ అరుణ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## కమిషనరేట్ లో కొనసాగుతున్న పోలీస్ డ్యూటీ మీట్



**వరంగల్, ఆయుధం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సోమవారం ప్రారంభమైన పోలీస్ డ్యూటీ మీట్ రెండవ రోజు కూడా ఉత్సాహంగా కొనసాగింది. మూడు రోజుల పాటు జరగనున్నాయి. అదనపు డీసీపీ బాలస్వామి ప్రారంభించిన పోలీస్ డ్యూటీ మీట్ పోటీల్లో అధికారులు, సిబ్బంది కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ విభాగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.



## బాధిత కుటుంబానికి టీపీఆర్‌యూఎస్ సాయం

**యాదాద్రి భువనగిరి, ఆయుధం:** యాదాద్రి భువనగిరి జిల్లా, కొయ్యలగూడెం గ్రామంలో రెండు కిడ్నీలు పాడై మృతిచెందిన నిరుపేద పద్మశాలి యువకుడు వర్కాల ఉపేందర్ కుటుంబానికి తెలంగాణ పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా కమిటీ అండగా నిలిచింది. చిన్న వయసులోనే ఉపేందర్ మరణించాడని విషయం తెలుసుకున్న టీపీఆర్‌యూఎస్ కార్యవర్గ సభ్యులు ముందుకొచ్చారు. కార్యవర్గ సభ్యులు అందజేసిన రూ.20,500, సభ్యులు అందజేసిన రూ.19,972 కలిపి మొత్తంగా రూ.40,500 ఉపేందర్ కుమార్తె పేరున డిపాజిట్ చేసి కొయ్యల గూడెంలో బాధిత కుటుంబానికి అందజేసినట్లు అధ్యక్షుడు వడ్డెపల్లి నర్సింగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు దోర్నాల విజయకుమార్, కోమాకుల సమ్మయ్య, గెంట్యాల రామచంద్రం ఉపాధ్యక్షులు, బోడ అశోక్ కుమార్ సంయుక్త కార్యదర్శి, కొయ్యలగూడెం పద్మశాలి సంఘం అధ్యక్షులు పొట్టబత్తిని బాలరత్నం, సర్పంచ్ కైరంకొండ స్వప్న అశోక్ దంపతులు, ప్రముఖులు హాజరయ్యారు.



## మృతుడి కుటుంబానికి ప్రదీప్ రావు పరామర్శ

**వరంగల్, ఆయుధం:** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని రంగశాయిపేట ప్రాంతానికి చెందిన మండల పరశురాములు, మండల నరసింహారాములు తండ్రి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు మంగళవారం వారి నివాసానికి వెళ్లి.. రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, జిల్లా కార్యదర్శి మందా శ్రీనివాస్, మండల అధ్యక్షులు తాళ్లపల్లి అర్జున్, బోరిగం నాగరాజు, సీనియర్ నాయకులు బక్కి రంజిత్, కర్నే రవీందర్, శ్రీరామోజీ మోహనచారి, పరమేష్, తాటికొండ ప్రసాద్, జూలూరి నైనేష్, లక్ష్మణ్, లక్కాకుల రాజు, ఆదిత్య చిన్న, కర్నె వరుణ్, శ్రీనివాస్, వెంకటేష్, కార్తీక్ స్థానిక నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ఊరచెరువు పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి

హనుమకొండ, ఆయుధం: గోపాల్‌పూర్ ఊరచెరువులో కొనసాగుతున్న డీసిల్టేషన్ (పూడిక తొలగింపు), రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండలోని గోపాల్‌పూర్ ఊరచెరువును సందర్శించిన కలెక్టర్, అక్కడ కొనసాగుతున్న డీసిల్టేషన్ మరియు రీటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, వేగంపై ఇరిగేషన్ మరియు జీడబ్ల్యూఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో చెరువు అభివృద్ధి పనులకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అదనపు యంత్రాలు, సిబ్బందిని వినియోగించి డీసిల్టేషన్ మరియు రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులను ఈ వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణ ద్వారా వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం మెరుగుపడుతుందని, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిరంతర పర్యవేక్షణతో చేపట్టాలని అధికారులకు సూచించారు.

# డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్

- వరంగల్ జిల్లా బిజెపి కార్యాలయంలో ఘన నివాళులు
- పాల్గొన్న జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్




**వరంగల్, ఆయుధం:** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, మహోన్నత దేశభక్తులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి ని మంగళవారం ధర్మారం, వరంగల్ జిల్లా బిజెపి కార్యాలయంలో నిర్వహించారు. బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
అనంతరం జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ సేవలను, వారి త్యాగాలను కొనియాడారు. "ఒకే దేశంలో రెండు చట్టాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు చెల్లవు" (ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహీ చలేంగే) అనే నినాదంతో దేశ సమగ్రత కోసం ముఖర్జీ పోరాడారని గుర్తుచేశారు. జమ్మూ కాశ్మీర్‌ను భారతదేశంలో సంపూర్ణంగా విలీనం చేయడం కోసమే ఆయన తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి జైలులోనే అనుమానాస్పద స్థితిలో ప్రాణత్యాగం చేశారని, అందుకే ఈ రోజును బిజెపి శ్రేణులు 'బలిదాన్ దివస్' గా పాటిస్తున్నాయని తెలిపారు. ముఖర్జీ కన్న కలలను, ఆయన ఆశయాలను నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్‌లో 'ఆర్టికల్ 370' ని రద్దు చేయడం ద్వారా నెరవేర్చిందని స్పష్టం చేశారు. కాశ్మీర్ నేడు భారతదేశంలో పూర్తి అంతర్భాగంగా మారి అభివృద్ధి పథంలో దూసుకుపోవడమే ముఖర్జీ కి దక్కిన నిజమైన నివాళి అని పేర్కొన్నారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశభక్తి, జాతీయవాద సిద్ధాంతాలు నేటి యువతరానికి, ప్రతి బిజెపి కార్యకర్తకు నిరంతర స్ఫూర్తిదాయకమని, వారి అడుగుజాడల్లో నడుస్తూ దేశ సేవకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ కుడికాల శ్రీధర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, త్రిలోక్, పోలేపాక మార్టిన్ లూథర్, బైరి మురళీకృష్ణ, అంకాల జనార్ధన్, కంది క్రాంతి కుమార్, గోదాసి అశ్విన్ కుమార్ పాల్గొన్నారు.

## హైదరాబాదులో రోడ్డుకు ట్రంపు పేరు సిగ్గుచేటు

- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్
- వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద నిరసన



**వరంగల్, ఆయుధం:** ప్రపంచ అశాంతికి ధరల పెరుగుదలకు కారణభూతమైన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరును హైదరాబాదులోని అమెరికా కాన్సులేట్ అవెన్యూ ఆఫీస్ ప్రధాన రహదారికి నామకరణం చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటని ఎం సి పి ఐ (యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ఎం సి పి ఐ (యు) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఆందోళన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి, ట్రంపుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి మాలోతు సాగర్ అధ్యక్షతన ఆందోళనలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు పేరుకు ప్రజా ప్రయోజనాల కోసం పనిచేస్తున్నామని ప్రచార ఆర్భాటం చేస్తూ ఆచరణలో పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తులకు వంత పాడుతున్నారని దీనికి తోడు ప్రపంచాన్ని తన కబంధహస్తాల్లో బంధించాలని చూస్తున్న అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధానాలకు దాసోహం అయ్యారని ప్రపంచ దేశాల మధ్య చిచ్చు పెడుతూ అశాంతిని రగిలిస్తూ పెత్తందారి పోకడలతో ప్రజల ప్రాణాలను బలికొంటున్న ట్రంప్ మరోవైపు ధరల పెరుగుదలకు ప్రధాన కారకుడు అయ్యాడని ఇదంతా కళ్ళ ముందు కనబడుతున్న అందు వ్యతిరేకంగా నిలబడి దేశ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పని చేయాల్సిన మోడీ రేవంత్ రెడ్డిలు అందు విరుద్ధంగా వ్యవహరించడం అన్యాయం అన్నారు. దేశంలో రాష్ట్రంలో అనేకమంది త్యాగధనుల ఫలితంగా దేశానికి స్వాతంత్రం, తెలంగాణ విముక్తి జరిగిందని అలాంటి మహానుభావుల పేర్లను ఎక్కడ నామకరణం చేయకుండా దేశ ప్రజలకు హాని కలిగించే హాని కలిగించే వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటూ అమెరికాతో చేసుకుంటూ ట్రంప్ పేరును హైదరాబాదు మహానగరంలోని రోడ్డుకు పెడతామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇలాంటి పద్ధతులను మానుకొని రాష్ట్ర దేశ చరిత్రను కాపాడాలని డిమాండ్ చేశారు లేకపోతే తగిన విధమైన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు సింగతి సాంబయ్య జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి, సుంచు జగదీశ్వర్, జిల్లా నగర నాయకులు ఎగ్గెని మల్లికార్జున్, అప్పనపురి నర్సయ్య, గణిపాక ఓదేలు, మాలి ప్రభాకర్, నలివెల రవి, బిట్ల సమ్మయ్య, రాయినేని, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వీబీ.జీ.రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి

- ఎంజి నరేగాను పునరుద్ధరించాలి
- ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తాం
- కలెక్టరేట్ వద్ద ధర్నాలో బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు




**వరంగల్, ఆయుధం:** కేంద్ర ప్రభుత్వం వెంటనే వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి అమలు జరపాలని.. లేనిచో దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల ఉద్యమాలను ఉధృతం చేస్తామని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు హెచ్చరించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన నిరసన ప్రదర్శన, ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్రాములు ప్రసంగిస్తూ అనేక పోరాటాలు చేసి సాధించుకున్న ఎంజి నరేగాను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి దాని స్థానంలో కార్మిక ప్రయోజనాలను కాలరాసే వి బి జి రామ్ జి చట్టాన్ని తెచ్చి దానిని జులై ఒకటి నుండి అమలు జరిపేందుకు మే 11 న జారీ చేసిన నోటిఫికేషన్ వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కొత్త నిబంధనలతో 25 కోట్ల మంది ఉపాధి కూలీలు ఉపాధి కోల్పోయే ప్రమాదముందన్నారు. ఉపాధి పనులకు గతంలో కేంద్ర ప్రభుత్వం 90% రాష్ట్రప్రభుత్వం 10% నిధులు భరించేదని, కొత్త చట్టం ప్రకారము కేంద్ర ప్రభుత్వము 60 శాతము రాష్ట్ర ప్రభుత్వము 40 శాతం నిధులు భరించాల్సి ఉంటుందని, ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాలపై పెను భారం పడి ఉపాధి పనులు మూలకు పడే ప్రమాదం ఉందన్నారు తక్షణమే మోడీ ప్రభుత్వం కార్మికుల ఉపాధి హక్కును హరిస్తున్న వీ బీ జీ రామ్ జీ ని రద్దుచేసి ఎంజి నరేగా ను పునరుద్ధరించాలన్నారు. 3 లక్షల కోట్ల రూపాయల నిధులు కేటాయించి సంవత్సరంలో 200 రోజులు పనులు కలిగించి రోజుకు 700 రూపాయల కూలీ ఇవ్వాలన్నారు. ఆరోగ్య భీమా మరణం లేదా అంగవైకల్యం సంభవించినప్పుడు రూ.పది లక్షలు
నష్టపరిహారం చెల్లించాలని, పని ప్రదేశాలలో కనీస మౌలిక సదుపాయాలు కలిగించాలని లేనిచో దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మికులు తమ హక్కులు, గౌరవం, జీవనోపాధిని కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య పోరాటాలు తీవ్రతరం చేయవలసి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మద్దెల ఎల్లేష్, జిల్లా అధ్యక్షుడు మునిగాల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకట్రాజం, బొట్టు బిక్షపతి, పి.సునీల్, శిరీష, మునిగాల స్వామి, మణికంఠ లావణ్య, సమ్మక్క, సుజాత, పద్మ, శ్రీలత, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం ప్రతినిధి వర్గం వ్యవసాయ కార్మిక డిమాండ్స్ పై ప్రధానమంత్రి కి సమర్పించే వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ కు అందజేశారు.

## ఎంఎస్ఎంఈలు ఉత్పత్తి, విక్రయాల పెంపుపై దృష్టి పెట్టాలి

- అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవం సందర్భంగా హనుమకొండలో ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు



**హనుమకొండ, ఆయుధం:** అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ రిజర్వ్ బ్యాంక్, హైదరాబాద్ ఆర్థిక సమ్మిళిత, అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో 2026 జూన్ 23న హనుమకొండ గుడిబండల్ సమీపంలోని వారాహి ఫంక్షన్ హాలులో మంగళవారం ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమం ప్రధానంగా వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని సంప్రదాయ కళాకారులు, నేత కార్మికులు, సహకార సంఘాలు, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన బ్యాంకింగ్, ప్రభుత్వ శాఖలు, ఇతర భాగస్వామ్య సంస్థల సహకారాన్ని అందించే దిశగా సాగింది. వరంగల్ కొత్తవాడ దరీస్ (తివాచీలు), శ్యాంపేట్ హ్యాండ్లూమ్స్, ఉర్సుకరీమాబాద్ తివాచీ క్లస్టర్, రంగశాయిపేట ఇత్తడి కళాకారుల క్లస్టర్, మహదేవ్‌పూర్ టసర్ సిల్క్ క్లస్టర్‌ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్, హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకులు చిన్మయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నాబార్డ్ వరంగల్ జిల్లా అభివృద్ధి మేనేజర్ వి. చైతన్య రవి థంగా నాబార్డ్ ఆధ్వర్యంలో అమలవుతున్న "మై డిస్ట్రిక్ట్ - మై ప్రాజెక్ట్" మరియు "ఎం సువిధ" కార్యక్రమాల కింద గుర్తించిన క్లస్టర్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో రెండు ప్రత్యేక ప్యానెల్ చర్చలు నిర్వహించారు. మొదటి ప్యానెల్‌లో చేనేత, హస్తకళలు, గ్రామీణ పరిశ్రమల క్లస్టర్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటి పరిష్కారానికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, శాఖల సహకారం గురించి చర్చించారు. ఈ చర్చలో తెలంగాణ రాష్ట్ర ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల బోర్డు, వరంగల్ మరియు హనుమకొండ జిల్లా పరిశ్రమల కేంద్రాలు, చేనేత మరియు వస్త్ర శాఖ, టీజీఎస్‌కో హ్యాండ్లూమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. రెండవ ప్యానెల్ చర్చలో ఉత్పత్తుల రూపకల్పన, బ్రాండింగ్, ప్యాకేజింగ్, డిజిటల్ ప్రచారం, ప్రదర్శనలు మరియు కొనుగోలుదారులతో అనుసంధానం ద్వారా మార్కెట్ అవకాశాలను ఎలా పెంచుకోవచ్చనే అంశాలపై చర్చించారు. ఈ చర్చలో క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ, వీహబ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ ప్రతినిధులు పాల్గొన్నారు.
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్, ప్రాంతీయ అధిపతి కమలాకర్ గంటి మాట్లాడుతూ, కళాకారులు మరియు సూక్ష్మ పారిశ్రామికవేత్తలకు బ్యాంకు రుణాల ప్రాముఖ్యత, క్రెడిట్ క్రమశిక్షణ మరియు అనుకూల ఆర్థిక సహాయ అవకాశాల గురించి వివరించారు. ఈ సదస్సు ద్వారా వరంగల్, హనుమకొండ పరిసర ప్రాంతాల్లోని సంప్రదాయ క్లస్టర్ల పునరుజ్జీవనం, బలోపేతం కోసం వివిధ శాఖలు, ఆర్థిక సంస్థలు మరియు అభివృద్ధి భాగస్వాములు ఒకే వేదికపైకి రావడం విశేషమని నిర్వాహకులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎ. నరసింహమూర్తి, హనుమకొండ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి. నవీన్ కుమార్, హనుమకొండ చేనేత మరియు వస్త్ర శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, టీజీఎస్‌కో ప్రతినిధి బొట్టు వెంకటేశ్వర్లు, క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధి అర్జున్ నార్నే, జాహిద్ అఖ్తర్ షేక్, ఉషా సజ్జా (వీహబ్) తదితరులు పాల్గొన్నారు. మహదేవ్‌పూర్ టసర్ సిల్క్ క్లస్టర్‌కు చెందిన నేత కార్మికులు, రంగశాయిపేట ఇత్తడి కళాకారులు, తివాచీ తయారీదారులు మరియు వివిధ కళారంగాలకు చెందిన శిల్పులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ప్రకాష్ బాధ్యతలు

**వరంగల్, ఆయుధం:** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వరంగల్ కార్యాలయంలో మంగళవారం మీసాల ప్రకాష్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాలు ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు వేము నరేందర్ రెడ్డి, మాజీ MLC కొండా మురళీధరరావు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి సహాయ సహకారముతో జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కాగా, బాధ్యతలు చేపట్టిన ప్రకాష్‌కు మబ్బు ప్రవీష్, సకినాల రజనీకాంత్ 'జారతి వెంకట్, దూర మహేందర్, బూర సురేష్, జంగం ప్రభాకర్, ఠాగూర్, బజరంగ్ సింగ్, క్యాతం రవీందర్, సర్దార్ జస్వీర్ సింగ్, దౌడు నాగరాజు, గూడ శారదా, గూడ రమ, అరుణ, విశాల్, లక్ష్మణ్, వాజరు, ప్రభాకర్, జిల్లా గ్రంధాలయ సంస్థ ఉద్యోగులు, చిన్న జాబు, అరుణ, రాజమౌళి, లక్ష్మినారాయణ, ప్రత్యూష సిబ్బంది తదితరులు సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలిపారు.

## యువకుడిపై కత్తులతో దాడి

- కాటారం మండలంలో పట్టపగలే ఘటన
- తీవ్రంగా గాయపడిన యువకుడు
- ఆస్పత్రికి తరలింపు



**భూపాలపల్లి, ఆయుధం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో పట్టపగలే ఓ యువకుడిపై గుర్తుతెలియని దుండగులు కత్తులతో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ధన్వాడ-గుమ్మల్లపల్లి గ్రామాల మధ్య మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఓడిపిలవంచ గ్రామానికి చెందిన చిగురు గణేష్ అనే యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. దాడి సమయంలో గణేష్ కేకలు వేయడంతో సమీపంలో ఉన్న రైతులు అక్కడికి చేరుకున్నారు. గమనించిన దుండగులు వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో గణేష్ ఛాతిపై తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించగా, అతడిని భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. దాడికి గల కారణాలపై ఆరా తీస్తూ, పరారీలో ఉన్న దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాటారం ఎస్సై గడ్డం శ్రీనివాస్ తెలిపారు.

## ఒక్కరోజే 1.9కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా

**జాతీయం, ఆయుధం:** అమెరికాఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందంతో హర్మ్యూజ్ జల సంధిలో నౌకాయానం తిరిగి ఊపిరి పీల్చుకుంటోంది. తాజా పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్) స్పందించారు. నిన్న ఒక్కరోజే 1.9 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు రవాణా జరిగిందని, ఇది ఆల్‌టైమ్ రికార్డు అని పేర్కొన్నారు. చమురు ధరలు పడిపోతున్నాయని.. ప్రపంచం సురక్షితమైన ప్రదేశంగా మారిందంటూ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు చేశారు. ఇక ఇరాన్‌తో ఒప్పందం గురించి ప్రస్తావిస్తూ.. భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఆ దేశం అంగీకరించిందన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695